## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కొత్తూరు, పాలజెండా, రెడ్డి కాలనీ, బుద్ధ భవన్, యాదవనగర్, హనుమాన్ నగర్, గోపాల్‌రావు బిల్డింగ్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### హసన్‌పర్తి ఎంపీడీఓగా రవి బాధ్యతల స్వీకరణ



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల అభివృద్ధి అధికారిగా రవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న కర్ణాకర్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ విజయలక్ష్మి, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన భద్రకాళి ఆలయ ఈఓ రామల సునీత



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయ కార్యనిర్వాహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత శనివారం హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్వగృహంలో శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

### యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా సాత్విక



హన్మకొండ చౌరస్తా: తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా హనుమకొండకు చెందిన ఈవీ.సాత్వికను నియమిస్తూ యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సయ్యద్ ఖలీద్ అహ్మద్, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ క్రిష్ణ అల్వార్, జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్‌జీ ఆదేశాల మేరకు నియమించినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### విద్యార్థులకు ఆర్థిక చేయూత



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని డంకెన్ బాబా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున చెక్కులను ఉల్లాస్ ట్రస్ట్ సభ్యులు శనివారం అందజేశారు. కాజీపేట మండలంలోని మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సంస్థ కోఆర్డినేటర్ పీఎల్ నరేందర్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రావు, సునీత, కేజియ, విద్యావతి, శైలజ, అలువేలు మంగ, సతీష్, అనిత తదితరులు పాల్గొన్నారు.

### ఐఐటీ విద్యార్థినికి ఆర్థిక సాయం



హన్మకొండ అర్బన్: సేవ వెల్ఫేర్ సొసైటీ వరంగల్ ఆధ్వర్యంలో ఐఐటీ విద్యార్థిని గోలి సింధూజకు రూ.35 వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి అయిత ఉషాభాస్కర్ తెలిపారు. అడ్వకేట్ కాలనీలోని క్రేసన్ ట్రాస్ ఐటీ సొల్యూషన్స్ కార్యాలయంలో శనివారం జరిగిన చేయూత కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు గోలి కవిత, బాబుకు చెక్కును సొసైటీ నిర్వాహకుడు జూపాక రత్న ప్రణయ్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి దూలం సందీప్, సభ్యులు అబ్దుల్ నయీమ్, శివప్రసాద్, రాజు, రాము, రాకేష్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లమ్మ ఆలయంలో పూజలు

కాజీపేట: శ్రావణ మాసం సందర్భంగా కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు శంకర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని పంచామృతంతో అభిషేకించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఎల్లమ్మ తల్లికి గౌడ సంఘం అధ్యక్షుడు బొల్లికొండ యాదగిరి, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, రమ దంపతులతో పాటు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కాజీపేట పట్టణంలో మద్యం మత్తులో రోడ్లపై పడిపోయిన మందుబాబులు







# తాగుతాం.. తాగి ఊగుతాం

- రహదారుల పక్కన పడిపోతున్న మద్యం ప్రియులు

కాజీపేట: మేము తాగుతాం... ఎక్కడ పడితే అక్కడే పడిపోతాం.. నీకెందుకు అంటూ దారినపోయే వారిని తాగుబోతులు బండ బూతులు తిడుతున్న సంఘటన కాజీపేట చౌరస్తాలో నిత్యకృత్యంగా మారింది. కాజీపేట పట్టణంలోని మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. ఈ దుకాణాల్లో అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా మద్యం అమ్మకాలు కొనసాగుతుండడంతో మద్యపాన ప్రియులు తాగి రహదారుల పక్కనే పడిపోతున్నారు. అయ్యోపాపం అంటూ ఎవరైనా లేపబోతే కొంతమంది మద్యంప్రియులు వారినే నానా బూతులు తిడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో తాగుబోతులు రోడ్డుపైనే చిందులేస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో బెల్ట్ షాపుల్లో మద్యంతోపాటు కొన్ని ప్రాంతాల్లో కల్తీ కల్లు కూడా విక్రయిస్తుండడంతో మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. తాగుబోతుల వీరంగాలు ఇక్కడ ఎక్కువయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి



చెక్కులు అందుకున్న విద్యార్థులతో బాధ్యులు

న్యూశాయంపేట: విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, గిర్మాజీపేట పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ బీఆర్ భరత్‌కుమార్ సూచించారు. 12 ప్రభుత్వ పాఠశాలల 200 మంది మెరిట్ విద్యార్థులకు హైదరాబాద్ ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరంగల్ ఆటోనగర్‌లోని ప్రభుత్వ గిర్మాజీపేట పాఠశాలలో ప్రతి ఒక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదు పారితోషకాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులకు ఉల్లాస్ సంస్థ నగదు ప్రోత్సాహకం అందించడం అభినందనీయమన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థిగా తనవంతు సహాయంగా పదో తరగతి మెరిట్ విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ప్రతీ సంవత్సరం పారితోషకం అందజేస్తానని హామీ ఇచ్చారు. హెచ్‌ఎం సుభాషిణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ జోసెఫ్, జిల్లా కోఆర్డినేటర్ నరేందర్, సంపత్‌కుమార్, భూపాల్, నాయకులు ఎలుగం సత్యనారాయణ, బోడ డిన్నా, చిప్ప వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్.. భవిష్యత్‌కు మార్గనిర్దేశం



మాట్లాడుతున్న న్యాయమూర్తి పూజ

రామన్నపేట: ఇంటర్మీడియట్ విద్య.. భవిష్యత్‌కు మార్గనిర్దేశమని జూనియర్ ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ పూజ పేర్కొన్నారు. వరంగల్ కృష్ణాకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ పూజ మాట్లాడుతూ విద్యార్థి దశలో సోషల్ మీడియాలో వచ్చే పోస్టింగ్‌లకు స్పందించవద్దని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు వనమాల, ప్రవళిక పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సభ్యులు సేవ చేయాలి




సదస్సులో మాట్లాడుతున్న మోనిక సావంత్

మడికొండ: లయన్స్ క్లబ్ సభ్యులు పోటీపడి సేవ చేయాలని మహారాష్ట్ర నుంచి అతిథిగా వచ్చిన పూర్వ గ్యాట్ నాయకురాలు మోనిక సావంత్ సూచించారు. మడికొండ శివారు ధర్మసాగర్ రోడ్డులోని ఒక కన్వెన్షన్ హాల్‌లో నూతన గవర్నర్, సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం శనివారం జరిగింది. 320ఎఫ్ జిల్లా నూతన గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అంతర్జాతీయ డైరెక్టర్ డాక్టర్ బాబురావు మాట్లాడుతూ సమాజ హితమే లయనిజం అని అన్నారు. తొలుత 320ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన వీడీజీ 1గా నరహరి సుధాకర్‌రెడ్డి, వీడీజీ 2గా పుట్టా హరికిషన్ రెడ్డితో పాటు కేబినెట్ కార్యదర్శిగా రేణికుంట్ల ప్రకాశం, కేబినెట్ ట్రెజరర్‌గా రఘునాథరెడ్డి, రీజియన్ చైర్మన్లు, జోన్ చైర్మన్లు, గ్యాట్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ మల్టీపుల్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, ఆవుల గోపాల్‌రావు, జిల్లా గవర్నర్ చంద్రశేఖర్, కుందురు వెంకట్‌రెడ్డి, పరశురాములు, ముచ్చ రాజిరెడ్డి, రాజేందర్‌రెడ్డి డాక్టర్ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

### పింగిళి వెంకయ్య జయంతి



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

విద్యారణ్యపురి: జాతీయ జెండా రూపకర్త పింగిళి వెంకయ్య జయంతి వేడుకలను హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పింగిళి వెంకయ్య చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ యుగేందర్, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు రత్నమాల, బి.సునీత, రాజేశ్వరి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విజేతలైన మాధవి, కల్పన, అల్పాన్సకు బహుమతులు ప్రదానం చేశారు.

## పెన్షనర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి

రామన్నపేట: తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ జిల్లా సమావేశాన్ని 22వ డివిజన్‌లోని ఇన్నర్‌వీల్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎనుకున్నట్లు పెన్షనర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వీరస్వామి తెలిపారు. ఎన్నికల అధికారులుగా వెంగల్‌రెడ్డి, శంకర్ నారాయణ వ్యవహరించగా, అధ్యక్షుడిగా తుమ్మ వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా గునిగంటి సాంబయ్య, ఆర్థిక కార్యదర్శిగా సదానందం, అసోసియేట్ అధ్యక్షుడిగా పెట్లోజు పరమేశ్వర్, ఉపాధ్యక్షులుగా వీరకుమారస్వామి, వనజ, మొయినొద్దీన్, వెంకటనారాయణ, పెద్దూరి పెద్దన్న, గుర్రం నరసింహారాములు, ఎండీ.మహబూబ్ అలీ, కార్యదర్శులుగా రాజయ్య, సారంగపాణి, ఆడెపు భిక్షపతి, సరస్వతి, ఆకుల విజయ్‌కుమార్, మధుసూదన్ రావు, గుండు కామేశ్వర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గందె హరిప్రకాశ్, కుమారస్వామి, గునిగంటి రమేష్, వీరస్వామి, బత్తుల సత్యనారాయణ, కె.సారంగపాణి, ఎండీ.షరీఫొద్దీన్, కార్యవర్గ సభ్యులుగా వేల్పుల రవీందర్, వీరశేఖరం, వేణుగోపాల్, డెనియల్, కాంతయ్య, బి.రఘుపతి ఎన్నికయ్యారు.

### ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

రామన్నపేట: వరంగల్ పాత బీట్‌బజార్‌లో డీవీఆర్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్కిల్ ఫర్ సొసైటీ కెపాసిటీ బిల్డింగ్ ఇన్ టెక్స్‌టైల్ సెక్టార్ సౌజన్యంతో ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యాలయంలోని ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ సూచించారు. శిక్షణ శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ గందె కల్పన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. 45 రోజులపాటు మహిళలకు కుట్టు శిక్షణ ఉంటుందని వివరించారు. సెంట్రల్ కో ఆర్డినేటర్ అనూష, రాజమణి, అల్లాడి వనజ, అల్లాడి వీరభద్రయ్య పాల్గొన్నారు.

## టీచర్లకు పాత పింఛన్ వర్తింపజేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కాజీపేట రూరల్: డీఎస్సీ -2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ వర్తింపజేయాలని, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, ప్రభుత్వ ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్ రాజు డిమాండ్ చేశారు. కాజీపేట మండలంలోని కాజీపేట బాలురు, బాలికలు, జాగీర్ దర్గా, సోమిడి, భట్టుపల్లి పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఏకశిల పార్కు వద్ద ఈనెల 5న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శులు చుంచుకాల లింగారెడ్డి, కె.సదానందం, కాజీపేట మండల బాధ్యులు టి.థావు, సోమయ్య, హరీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### 7న గోవాలో ఓబీసీ మహాసభ

మడికొండ: ఈ నెల 7వ తేదీన గోవాలో జరగనున్న ఓబీసీ మహాసభ కరపత్రాలను రాష్ట్ర ఆయిల్ సీడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి టేకులగూడెంలోని తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ ఓబీసీ మహాసభకు రాష్ట్రంలోని అన్ని ఓబీసీ కుల సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కేంద్రం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాడి మల్లయ్య, నార్లగిరి కుమారస్వామి, కందుగుల విజయ్, రాజు, సురేష్, మల్లేష్ పాల్గొన్నారు.

### ఫీజు మినహాయించాలని వినతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం కామన్ సర్వీసెస్ ఫీజును మినహాయించాలని కోరారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంను ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, బాధ్యులు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఆ ఫీజు భారం అవుతోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ఆదిత్య, బిక్షిత్‌రెడ్డి, ఈశ్వర్, చరణ్, అక్షయ్, అంజద్, ప్రేమ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మడికొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాజీపేట మండలం మడికొండలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గడ్డం ఎల్లేష్(45) కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం కూలికి వెళ్లి తిరిగి వస్తూ రాత్రి 8గంటలకు రోడ్డు దాటుతుండగా కాజీపేట నుంచి రాంపూర్ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం అతడిని ఢీ కొట్టింది. దాంతో తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు ఎల్లేష్‌కు ప్రథమ చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లారు. శనివారం ఉదయం అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణించాడు. ఈ మేరకు మృతుడి తమ్ముడు గడ్డం ఆనందం ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ వివరించాడు.

## ఉద్యోగంతో పాటు సామాజిక ఉద్యమాలు



హన్మకొండ: ఓ వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ మరో వైపు సామాజిక ఉద్యమాల్లో రాతు రమేష్ కుమార్ చురుకైన పాత్ర పోషిస్తున్నారని, తెలంగాణ ఉద్యమంలోనూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీలో కీలకంగా వ్యవహరించారని టీజీ ఎన్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతి రెడ్డి కొనియాడారు. దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ ఉపాధ్యక్షుడు రాతు రమేష్ కుమార్ పుట్టిన రోజు వేడుకలను హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం జరుపుకున్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్క దానయ్య, జడల రవి, జి.నరసన్న, రాజకుమార్, వస్కుల కృష్ణ, యాకయ్య, రాజు పాల్గొన్నారు.

## 6, 7వ తేదీల్లో భోజన కార్మికుల దీక్షలు



విద్యారణ్యపురి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6, 7వ తేదీల్లో తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కురాజు గౌడ్, ధర్మల రాంమూర్తి తెలిపారు. అల్పాహారం సంబంధిత పెండింగ్ బిల్లులు వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని సూచించారు. అలాగే, సెప్టెంబర్ 1నుంచి నిరవధిక సమ్మె చేయబోతున్నట్లు హెచ్చరించారు. ఈ మేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయంలో సిబ్బందికి సమ్మె నోటీస్ అందజేశారు.

## ఎన్నికల హామీలను నెరవేర్చాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

ఖిలా వరంగల్: ఎన్నికల హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ కరీమాబాద్ ఉర్సుగుట్ట వద్ద పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు బాబు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో నాగయ్య మాట్లాడారు. ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనాన్ని వెలికితీసి ప్రజల ఖాతాల్లో వేస్తామని, ఉపాధి కూలీలకు చేతినిండా పని కల్పిస్తామని, దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగు పరుస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వరంగల్ నగరంలో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, వీధిలైట్ల సమస్యలు పేరుకుపోయాయని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని వివరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, రత్నమాల, అరూరి కుమార్, ప్రశాంత్, దుర్గయ్య, బషీర్, కుమారస్వామి, సాంబయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ క్లెయిమ్స్ విడుదల చేయాలి



వినోదకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా: సర్వర్ సమస్యతో 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను విడుదల చేస్తూ, లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వినోదకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్ మాట్లాడుతూ గతేడాది సహజ, ప్రమాదవశాత్తు మృతిచెందిన భవన నిర్మాణ రంగ కార్మికుల బాధిత కుటుంబాలు చేసుకున్న దరఖాస్తులను కార్మికశాఖ అధికారులు పరిశీలించి కార్మిక సంక్షేమ బోర్డుకు పంపించారని అన్నారు. అప్పుడు సర్వర్ సమస్యతో అవి తిరిగి వచ్చాయని పేర్కొన్నారు. మరోసారి దరఖాస్తు చేసుకుని ఏడు నెలలు గడుస్తున్నా ఆ దరఖాస్తులను సంక్షేమ బోర్డుకు పంపించకుండా కాలయాపన చేయడం దారుణమన్నారు. అనేకసార్లు డీసీఎల్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బల్లె రవి, రాజకుమారి, జీవన్, భాస్కర్, రవి పాల్గొన్నారు.

### లేబర్ కమిషనర్‌కు సన్మానం

కాజీపేట: హనుమకొండ జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వినోదను షెడ్యూల్ కులాల హక్కుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యమడాల అనుకాంత్, కార్మికులు శనివారం సన్మానించారు. కాజీపేటలో లేబర్ కార్డుల నమోదు ప్రక్రియను పరిశీలించిన వినోదను కార్మికులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్మికుల కోసం మెరుగైన సేవలు అందించాలని, క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## యాదవ భవనానికి స్థలం కేటాయించండి



ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత యాదవ మహాసభ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ నగరంలో ఇంటిగ్రేటెడ్ యాదవ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధులు కోరారు. ఈమేరకు బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా బాధ్యుడు గిరబోయిన రాజయ్య యాదవ్ మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో యాదవులు అధిక శాతం ఉన్నారని అన్నారు. యాదవుల సంక్షేమం కోసం నగరంలో ఇంటిగ్రేటెడ్ (శ్రీకృష్ణ ఆలయం, హాస్టల్, కమ్యూనిటీ హాల్) యాదవ భవన నిర్మాణ కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి బంక సంపత్‌యాదవ్, సీనియర్ నాయకులు బొజ్జ సమ్మయ్య, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు, నాయకులు దూడయ్య, బొజ్జ రవీందర్, బానుక సిద్ధిరాజు, బోయిని భిక్షపతి, బొంగు రాజు, దొంగల కుమార్, వేల్పుల భిక్షపతి, పెద్దబోయిన నాగరాజు, సెంసాని వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ దృష్టికి చేనేత సమస్యలు



వినతిపత్రం ఇస్తున్న సదానందం, శ్రీరాములు

హన్మకొండ: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ దృష్టికి చేనేత సమస్యలను వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు బోర్డు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు తీసుకెళ్లారు. జాతీయ చేనేత దినోత్సవం పదేళ్ల వేడుకలు జరుపుకోనున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని స్వగృహంలో దత్తాత్రేయను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రతియేటా ఆగస్టు 7న నిర్వహిస్తున్నట్లు వన్నాల వివరించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ ప్రభుత్వం సహకార సంఘాలు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించకుండా చేనేత కార్మికులను పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలు సహకార సంఘాల నుంచి చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వమైన చేనేత సహకార సంఘాలు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేసి, చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ గౌరవ సలహాదారు వేముల సదానందం నేత, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడ బాబురావు, నాయకుడు కర్నాటి ధనుంజయ పాల్గొన్నారు.